క్లుప్తంగా...

బ్లాక్‌బోర్డ్స్ అందజేత



శిశుమందిర్ పాఠశాలకు బోర్డులను అందజేస్తున్న రవీందర్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: పిల్లలకు చిన్ననాటి నుంచే విద్యపై మక్కువ కలిగేలా చర్యలు తీసుకోవాలని ఆపద్బాంధవ సేవా సమితి అధ్యక్షుడు కొప్పుల రవీందర్‌గౌడ్ అన్నారు. సేవాసమితి ఆధ్వర్యంలో మైలార్‌దేవ్‌పల్లిలోని శిశుమందిర్ స్కూల్‌కు 3 బ్లాక్‌బోర్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాల్లో ఆపద్బాంధవ సేవా సమితి ముందుంటుందన్నారు. విద్యార్థులు, ప్రజలకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే తమ లక్ష్యమన్నారు. ప్రధాన కార్యదర్శి వనమాల సురేష్‌గుప్తా, జాయింట్ సెక్రటరీ పాండురంగ విట్టల్, సభ్యులు పాల్గొన్నారు.

ఇంటింటికీ జాతీయ జెండా



జాతీయ జెండాలను పంపిణీ చేస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 22వ వార్డులో వినాయకనగర్‌లో భారత స్వాతంత్ర్య వజ్రోత్సవ ముగింపు కార్యక్రమంలో భాగంగా జాతీయ పతాకాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వాతంత్ర్య వజ్రోత్సవ ముగింపు కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ పతకాలను ఎగురవేసి భారతీయతను చాటాలని పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

పోలీసులకు ఏబీవీపీ రాఖీ



ఎస్సై సుమన్‌కు రాఖీ కడుతున్న దృశ్యం

శంషాబాద్: రక్షాబంధన్ సందర్భంగా ఏబీవీపీ నాయకులు బుధవారం ఆర్‌జీఐఏ పోలీసులకు రాఖీలు కట్టారు. సమాజానికి రక్షణగా ఉండే పోలీసులు ఆరోగ్యంతో పాటు భద్రత కలిగి ఉండాలని ఆకాంక్షిస్తూ.. రాఖీలు కట్టినట్లు ఏబీవీపీ నాయకులు తెలిపారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

శంషాబాద్ రూరల్: మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న స్వర్ణభారత్ ట్రస్టు ఆవరణలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. స్వర్ణ భారత్ ట్రస్టు, కేర్ ఆసుపత్రి సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరై ఈ శిబిరాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఎంజీఐటీలో 'రీసెర్చ్ ప్రపోజల్ రైటింగ్'పై సదస్సు

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో బుధవారం రీసెర్చ్, డెవలప్‌మెంట్ కమిటీ(ఆర్‌డీసీ) ఆధ్వర్యంలో 'రీసెర్చ్ ప్రపోజల్ రైటింగ్' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. బుధవారం పరిశోధన రంగంలో విశేష అనుభవం ఉన్న ఐఐటీ ముంబై ప్రొఫెసర్ గురురాజన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పరిశోధన, ప్రతిపాదనను రాయటానికి అవసరమైన నైపుణ్యాలను అందించడం , పరిశోధన పత్రాలను ఎలా రూపొందించాలనే అంశాలను ఆయన వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

మణికొండ: టీటీడీ బోర్డు సభ్యురాలిగా ఎంపికైన చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి సతీమణి సీతారంజిత్‌రెడ్డిని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నార్సింగి మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆర్. నర్సింహ, మణికొండ మున్సిపాలిటీ మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, నాయకులు జయరాజ్, బషీర్, సత్యనారాయణ, దిలీప్‌కుమార్ తదితరులున్నారు.

అంధకారంలో వీధులు


- ఏళ్లు గడుస్తున్నా బిగించని వీధిలైట్లు
- ఇబ్బందిపడుతున్న స్థానికులు
- పట్టించుకోని జీహెచ్‌ఎంసీ అధికారులు



విద్యుత్ దీపాలు లేని కరెంటు స్తంభాలు

మైలార్‌దేవ్‌పల్లి: వీధుల్లో కరెంటు స్తంభాలు వేసి ఏళ్లు గడుస్తున్న లైట్లు బిగించలేదు. దీంతో ఆ వీధిలోని ప్రజలు రాత్రిపూట అంధకారంలోనే గడుపుతున్నారు. రాత్రి సమయంలో స్థానికులు బయటికి వెళ్లాలంటే భయందోళనకు గురవుతున్నారు.

- రహదారి పొడవున స్తంభాలకు ఒక్క వీధిలైటు కూడా లేకపోవడం గమనార్హం.
- మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీలోని అంతర్గత రోడ్లపై వీధిలైట్లు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేకసార్లు జీహెచ్‌ఎంసీ అధికారులకు తెలిపినా పెడచెవిన పెడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఆ వీధిలో ఓ వ్యక్తి తన ఇంటి ముందు చీకటిగా ఉండటంతో సొంతంగా వీధిలైటు కొనుగోలు చేసి స్ట్రీట్‌లైట్‌ను స్తంభానికి బిగించాలని జీహెచ్‌ఎంసీ లైన్‌మెన్‌ను కోరగా.. 'మేము బిగించం అంటూ వెళ్లిపోయారని' స్థానికుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.
- కాలనీలో వీధిలైట్లు లేకపోవడంతో దొంగలకు సులువుగా మారిందని రెండుసార్లు దొంగలు పడి విలువైన ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటనలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యను సంబంధిత అధికారులు త్వరగా పరిష్కరించాలని కోరుతున్నారు.



అంధకారంలో మధుబన్‌కాలనీలో ఓ ప్రాంతం



రాత్రిపూట ఇబ్బందిగా ఉంది.

మా ఇంటి గల్లీలో రోడ్డు చివరి వరకు రాత్రి సమయంలో చిమ్మ చీకటిగా ఉంటోంది. చీకట్లో ఎవరు తిరుగుతున్నారో కూడా కనబడటం లేదు. ఈ మధ్యే మా ఇంటి చివరన ఉన్న ఇంట్లో దొంగలు పడి విలువైన ఆభరణాలు దొంగిలించారు. దయచేసి ఉన్నతాధికారులు స్పందించి మా వీధిలో స్ట్రీట్‌లైట్లు బిగించాలి.

– ప్రవీణ్, మధుబన్ కాలనీ

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

మణికొండ: ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహ దినం సెప్టెంబర్ 1న జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ గండిపేట మండల అధ్యక్షుడు మహ్మద్ మాజీద్ కోరారు. బుధవారం ధర్నా వాల్‌పోస్టర్‌ను ఉపాధ్యాయులతో కలిసి ఆయన నార్సింగి ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేసి ఐఆర్‌ను ప్రకటించాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్, నాయకులు ఎం. శ్రీనివాస్, ప్రమోద్‌రత్నం, బిక్షపతి, లోకేష్, బిలాల్‌ఖాన్, జనార్దన్, ప్రవీణ్ తదితరులున్నారు.

గాయత్రీమాతకు ప్రత్యేక పూజలు

మైలార్‌దేవ్‌పల్లి: దైవ చింతనతో మానవుడి జీవితానికి పరామార్థం కలుగుతుందని రాజేష్ శర్మ, పండిత్ శశికాంత్‌శర్మ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్‌లోని వెంకటేష్ బాలాజీ ఆలయంలో శ్రావణ మాస పూర్ణిమ సందర్భంగా శ్రావణ నక్షత్రంలో భాగ్యనగర్ విప్ర సంఘం ఆధ్వర్యంలో శుక్ల యజుర్వేదియ బ్రాహ్మణులు గాయత్రీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్కరిణీకుండ్‌లో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య స్నానం చేసి, సంధ్యావందనం చేశారు. అనంతరం యజ్ఞో పవిత పూజలు చేసి యజ్ఞోపవీత దానం చేసి ఆశీర్వాదాలు పొందారు. ప్రతి ఏడాది నిర్వహించే ఈ పూజా కార్యక్రమాలు సుమారు 31 ఏళ్లుగా నిర్వహిస్తున్నామన్నారు. పండిత్ పురుషోత్తమశాస్త్రి, జగదీష్ ప్రసాద్‌శర్మ, నవల్ కిషోర్, రామావతార్, బిర్దిచంద్, ప్రేమ్‌కాంత్, సురేష్, రమేష్, గణేష్ డాడిచ్, జ్యోతిష్యుడు శ్యామ్‌సుందర్‌చౌబే, ఓంప్రకాష్, లక్ష్మీనారాయణశర్మ, నందకిశోర్, నర్సింగ్, గోవింద, పుష్పేంద్ర, శివ, రాజేష్, నవీన్, పవన్, తారాచంద్, అంకితశర్మ, విశాల్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించే వారిని ప్రోత్సహిస్తాం



విజేతలకు మెడల్స్ అందించి వారితో వీసీ ప్రొ. సయ్యద్ ఐనుల్ హసన్ పలువురు ప్రొఫెసర్లు

రాయదుర్గం: చదువుతోపాటు క్రీడల్లో రాణించేవారిని ప్రోత్సహిస్తామని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన పలు రకాల పోటీల్లో విజేతలకు ఆయన మెడల్స్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ముఖ్యంగా 'స్పోర్ట్స్ ఈజ్ ఎనేబులర్ ఇన్‌క్లూజివ్, ఫిట్ సొసైటీ'అనే థీమ్‌తో పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టరేట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ (డీపీఈఅండ్ఎస్) ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చదువుకునే సమయంలో క్రీడలపట్ల ఆసక్తి కలిగి ఉంటే భవిష్యత్తులో ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ప్రొఫెసర్లు మహ్మద్ అబ్దుల్ అజీమ్, డాక్టర్ మహ్మద్ యూసుఫ్‌ఖాన్,డాక్టర్ ఏ కలీముల్లా పాల్గొన్నారు.

మంత్రి మహేందర్‌రెడ్డికి సన్మానం



సన్మానిస్తున్న పోరెడ్డి ధర్మారెడ్డి

రాజేంద్రనగర్: రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పట్నం మహేందర్‌రెడ్డిని రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ధర్మారెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రికి పూలబోకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. బీఆర్‌ఎస్ యూత్ లీడర్ కాటి దేవేందర్, గౌతమ్, నిఖిల్, వంశీ, నర్సింహ్మ తదితరులున్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం



కొంగరకలాన్‌లో జరిగిన సమావేశంలో మంత్రి సబితారెడ్డితో పాల్గొన్న ప్రభుత్వవిప్, ఎమ్మెల్యేగాంధీ

గచ్చిబౌలి: పేదల సొంతింటికల నెరవేర్చడమే డబుల్ బెడ్‌రూమ్‌ల లక్ష్యమని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కొంగరకలాన్‌లో మొదటి విడత డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ర్యాండమైజేషన్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్ డ్రా నిర్వహించే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు, నాయకులు, జిల్లా కలెక్టర్ హరీష్ పాల్గొన్న కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి విడతలో నియోజకవర్గానికి 500 చొప్పున కేటాయించారని గుర్తుచేశారు. శేరిలింగంపల్లిలోని 500 మంది లబ్ధిదారులకు పారదర్శకంగా కేటాయించడం జరుగుతుందన్నారు. శేరిలింగంపల్లిలో 2,910 దరఖాస్తులను పరిశీలించి అందులో మొదటి విడతలో 500 మందిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా స్థలం ఉన్న వారికి గృహలక్ష్మి కింద రూ.3 లక్షలను అందించి ఇల్లు నిర్మించుకునేందుకు సహాయం చేయడం జరుగుతుందని ఆయన గుర్తుచేశారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం

జిమ్ ట్రైనర్ హత్యపై పోలీసుల విచారణ ముమ్మరం

రాజేంద్రనగర్: అత్తాపూర్ సెలబ్రిటీ జిమ్ సెల్లార్‌లో హత్యకు గురైన రాహుల్‌సింగ్ కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. హత్య చేసిన అనంతరం నిందితులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయినట్లు సమాచారం. పోలీసులు మాత్రం నిందితులను ఇంకా గుర్తించలేదని, అన్నికోణాల్లో విచారిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రేమ వ్యవహారంతో పాటు ఆర్థికపరమైన వ్యవహారాల కారణంగానే హత్య జరిగిందని పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు. కొద్ది రోజుల క్రితం ప్రేమించిన యువతితో కాకుండా మరో యువతితో రాహుల్‌సింగ్ నిశ్చితార్థం జరిగిందని సమాచారం. దీంతో పాటు ఆర్థిక లావాదేవీల్లో పలు గొడవలు జరుగుతున్నాయని ఈ కోణంలో సైతం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని నిందితులను త్వరలో పట్టుకుంటామని ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు తెలిపారు. ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశామని, సీసీ కెమెరాలను సైతం పరిశీలిస్తున్నామని పోలీసులు వివరించారు.

మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించాలి



గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురుశెట్టిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు మరింత మెరుగైన విద్యాబోధనకు చేపట్టాల్సిన చర్యల గురించి కలెక్టర్‌కు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో కార్వాన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమంగా విద్యాబోధన జరిగేదని, దీనికి తోడు ఫలితాలు కూడా బాగా వచ్చేవన్నారు. రానురాను ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు తగ్గుతూ వచ్చాయని మౌలిక సదుపాయాలు లేకపోవడమే దీనికి ప్రధాన కారణమని అన్నారు. గోల్కొండ, లంగర్‌హౌజ్‌లోని ప్రభుత్వ పాఠశాల భవనాలు వర్షం పడితే లీకేజీలు వస్తున్నాయని ఆయన తెలిపారు. కొత్త భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారితో మాట్లాడి సమగ్ర నివేదిక తెప్పించుకుంటామని కలెక్టర్ అన్నారు.

చేపల వేటకు వెళ్లి.. వృద్ధుడి మృతి

శంషాబాద్ రూరల్: చేపల వేటకు వెళ్లిన వృద్ధుడు వాగు నీళ్లలో మునిగి మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పిల్లోనిగూడకు చెందిన ఆశమొల్ల మల్లయ్య (65) ఈ నెల 29న మధ్యాహ్నం గ్రామ సమీపంలో ఉన్న వాగులో చేపల వేటకు వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి రాలేదు. బుధవారం వాగు వద్ద పశువులు మేపడానికి వెళ్లిన ఆంజనేయులుకు వాగు నీళ్లపై తేలాడుతున్న మల్లయ్య మృతదేహం కనిపించింది. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. చేపల కోసం వేసిన వల ఇతని కాళ్లకు చిక్కుకోవడంతో నీళ్లలో మునిగి చనిపోయినట్లు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వినతిపత్రం అందజేత



రాజేంద్రనగర్ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైన బట్టల గోదాం పరిశ్రమకు ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవాలని మజ్లిస్‌పార్టీ మహమూద్‌నగర్ ప్రైమరీ యూనిట్ అధ్యక్షుడు మహ్మద్ జహంగీర్ కోరారు. ఈ మేరకు బుధవారం రాజేంద్రనగర్ డిప్యూటీ తహసీల్దార్ క్రాంతికుమార్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సులేమాన్‌నగర్ డివిజన్‌లోని ఫాతిమాకాలనీలో గత కొంతకాలంగా బట్టల గోదామ్ ఉందని, ప్రమాదవశాత్తు ఈ గోదాములో అగ్ని ప్రమాదం జరిగిందన్నారు. దీంతో నిర్వాహకుడు తీవ్రంగా నష్టపోయాడన్నాడు. ప్రభుత్వం తరపున బాధితుడిని ఆదుకోవాలని మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహమత్‌బేగ్‌ల దృష్టికి సైతం విషయాన్ని తీసుకెళ్లామన్నారు. వారి సూచనల మేరకు రాజేంద్రనగర్ మండల డిప్యూటీ తహసీల్దార్ క్రాంతికుమార్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. మహమూద్ ఇక్బాల్‌ఖాన్, ఎఐఎంఐఎం ఆక్టివ్ మెంబర్ ఎన్‌టీఆర్‌నగర్ ఎండీ మాజీద్, అబ్దుల్ ఖాదీర్, ఎండీ ఇస్మాయిల్, మజూద్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



కార్పొరేటర్ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

బండ్లగూడ: గంధంగూడలోని బృందావన్ కాలనీలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు పాటుపడతానని కార్పొరేటర్ తలారీ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం కాలనీ వాసులు కమ్యూనిటీ హాల్ భవనం, పార్కును ఏర్పాటు చేయాలని కార్పొరేటర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామన్నారు. ప్రజల సౌకర్యార్థం నూతన కమ్యూనిటీహాల్ భవనం నిర్మించేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కాలనీవాసులు జంగయ్య, శ్రీనివాస్, ఆంజనేయులు, ప్రేమ్‌కుమార్, ప్రభాకర్, శ్రీనివాస్, ఆంజనేయులు, పాల్, అరుణ్ తదితరులున్నారు.

అంగన్‌వాడీల సమ్మె నోటీసు



నోటీసును అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మణికొండ: రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల పిల్లలకు అనునిత్యం సేవలు అందిస్తున్న తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని లేదంటే తామంతా సమ్మెకు దిగుతామని అంగన్‌వాడీ టీచర్లు సమ్మె నోటీసు ఇచ్చారు. గండిపేట మండలం అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు సుధారాణి ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్‌లోని సీడీపీఓ కార్యాలయంలో నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మంత్రి సత్యవతి రాథోడ్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పలుసార్లు ధర్నాలు, వినతిపత్రాలు, నిరసనలు చేపట్టినా పట్టించుకోవటం లేదన్నారు. మండల కన్వీనర్ డి. ప్రవీణ్‌కుమార్, యూనియన్ నాయకులు రాణి, శోభ, వినోద, సుజాత టీచర్లు పాల్గొన్నారు.

'మూడోసారి అధికారం బీఆర్‌ఎస్ పార్టీదే'



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: ముచ్చటగా మూడోసారి అధికారం బీఆర్‌ఎస్ పార్టీదేనని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ధీమా వ్యక్తం చేశారు. తారానగర్‌కు చెందిన 100 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు మాజీ కౌన్సిలర్ వీరేశంగౌడ్, సీనియర్ నాయకుడు రాంచంద్రం ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి బీఆర్‌ఎస్ పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత అంతా బీఆర్‌ఎస్ వైపే ఉందని, యువత బీఆర్‌ఎస్‌లో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనుల పట్ల ప్రజలంతా ఆకర్శితులవుతున్నారన్నారు. శేరిలింగంపల్లిలో 9 ఏళ్లల్లో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశామని, మరోసారి అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు హరీష్‌రావు, చంద్రకాంత్‌రావు, ప్రసాద్, కాశీనాథ్, కోనేరు ప్రసాద్, వెంకట్‌నాయక్, శ్రీనివాస్, రవికుమార్, జ్ఞానేశ్వర్, రఘు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ వేడుకలు



శాంతిసరోవర్‌లో 9వ నిజాం రౌనక్‌యార్‌ఖాన్‌కు రాఖీ కడుతున్న కుల్‌దీప్‌దీదీ

రాయదుర్గం: రాఖీ వేడుకలను గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి వేడుకలను జరిపారు. 9వ నిజామ్ రౌనక్‌యార్‌ఖాన్‌ను సోదరుడిగా భావించి బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టి తమ సోదరభావాన్ని చాటారు. ఈ సందర్భంగా రౌనక్‌యార్‌ఖాన్ మాట్లాడుతూ.. ప్రశాంతతకు మారు పేరుగా పేర్కొనే ప్రాంతం శాంతిసరోవర్ అన్నారు. పవిత్రమైన రాఖీ వేడుకల్లో పాల్గొనడం బ్రహ్మకుమారీల చేత సోదరుడిగా రాఖీలు కట్టుకోవడం ఆనందంగా ఉందన్నారు. శాంతిసరోవర్ డైరెక్టర్ బి.కె.కుల్‌దీప్‌దీదీ మాట్లాడుతూ.. బ్రహ్మకుమారీల సంస్థ అనేది ఆధ్యాత్మిక ఆధారితమైన వ్యక్తులతో కూడిన అంతర్జాతీయ సంస్థ అని పేర్కొన్నారు.

కృష్ణవేణి హైస్కూల్‌లో ..

గచ్చిబౌలి: శ్రీరామ్‌నగర్‌లోని కృష్ణవేణి హైస్కూల్‌లో రాఖీ వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యార్థినులచే రాఖీలను కట్టించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రాఖీ పౌర్ణమి ప్రాధాన్యతను వివరించారు. అన్నాచెల్లెలు, అక్కాతమ్ముడి మధ్య ఉండే ప్రేమానుబంధాల కలకలం ఉంటాయని వారి ప్రాధాన్యతను వివరించారు.



శ్రీరామ్‌నగర్‌లోని కృష్ణవేణి హైస్కూల్‌లో రాఖీలు కడుతున్న విద్యార్థినులు

'తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం'

గోల్కొండ: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిన్‌రెడ్డి అన్నారు. కార్వాన్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కురకుల కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా రోహిన్‌రెడ్డి కార్వాన్‌లో కాంగ్రెస్ పార్టీ చేపట్టబోయే పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో కాంగ్రెస్‌లో ఇతర పార్టీల నుంచి వలసలు ప్రారంభమవుతాయన్నారు. రాష్ట్రాన్ని పాలిస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రజా సంక్షేమం పట్టదని కేవలం కుటుంబ సంక్షేమం కోసమే ఆయన అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. మరోవైపు బీజేపీ సైతం ప్రజాస్వామ్య విలువలను గౌరవించకుండా కేవలం తమ సొంత ఎజెండాను అమలు పరుస్తుందని ఆయన అన్నారు. చంటిబాబు, అప్సర్ యూసుఫ్ జాహీ, ఎం.రఘుపాల్‌రెడ్డి, ఏ.చంద్రశేఖర్, అబ్దుల్ హమీద్, రామ్‌కుమార్, ప్రేమ్‌కిషోర్, గోవర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.